# నిర్మాత

మరునాడు మహాత్మాగాంధీ పాఠం చెప్పాలి. పిల్లల లేత మనసుల్లో ఆ మహాత్మునిగాధ హత్తుకునేలా బోధించాలి. లెసన్ ప్లాన్ ప్రిపేర్ చేసు కుంటున్నారు రామనాథం మాస్టారు.

లెసన్‌ప్లాన్ నోట్‌బుక్ తెరిచారు. పాయింట్స్ నోట్ చేసుకుంటున్నారు.

బాలలూ— మన జాతి గర్వించదగ్గ ఓ మహనీయుని గాధను మీకిపుడు చెబుతాన్నా—.

ఊకబుర్లు చెప్పకు. నాలుగు నెలల్నుంచి జీతం రాలేదా? నీ మాయ మాటలు నమ్మడానికి నేనేం బడిపిల్లాన్ని కాదు. రేపీపాటికి కిరాయి ఇవ్వక పోయావో నీ సంసారం వీధిలో పడ్తతి జాగ్రత్త!

ఇంటి ఓనర్ హెచ్చరిక చెవుల్లో .గింగురుమంటోంది. ముచ్చెమటలు పోశాయి మాస్టారుకు. చేతిలోని కలం జారి పడింది. లెసన్‌ప్లాన్ పేజీమీద పిచ్చిగీతలు పడ్డాయి.

భారంగా కళ్ళు మూసుకున్నారు. కణతలు నొక్కుకున్నారు. నొసటి మీద చేత్తో రాసుకున్నారు. ఏం చేయాలి? ఏం చేయాలి? ఇప్పుడేంచేయాలి?—

లెసన్‌ప్లాన్ కాగితం గాలికి రెపరెప లాడుతోంది.

ఇంకొంచెం సేపయాక గుర్తుకు రాకూడదూ?

సరిగ్గా లెసన్‌ప్లాన్ ప్రిపేర్ చేసుకునేప్పుడే గుర్తుకు రావాలా?

బడికి పోయేప్పుడు ఈ బాధలు గుర్తుకొచ్చినా పాఠం చెబుతున్నప్పుడు గుర్తుకొచ్చేది ఇంతేకదా! మనసు కలతే కదా! ఉప్పొంగే గుండెతో పిల్లలకు పాఠాలు చెప్పి ఎన్నాళ్ళయింది!!!

అద్దెగోడవ ఒక్కటేనా! జీతాలురాని పంతుళ్ళ మెదడును సూదుల్లా గుచ్చే సమస్యలు కోకొల్లలు.

నిరాశపడకు బాబూ— ధైర్యంగా అడుగు ముందుకు వేయి— అని వెన్నుతట్టే మాస్టారు నిరాశపడతారా? ఉహూ— పడరు. ఒక్కసారి తల విదిలించి తిరిగి కలం తీసుకున్నారు. లెసన్‌ప్లాన్ ప్రిపేర్ చేస్తున్నారు.

ఈ దేశం నీది, నాది, మనందరిది— ఎందరో మహనీయుల త్యాగ ఫలితంగా ఉద్భవించిన స్వాతంత్ర్యాన్ని మనం కాపాడుకోవాలి.

మాస్టారు వచ్చేనెలలో తనకు ట్రాన్స్‌ఫర్ అయ్యే అవకాశం వుంది.

''వచ్చి ఏడాది కాలేదు. అప్పుడే ట్రాన్స్‌ఫరా?''

''అవును. ఆఫీసును మరచిపోతే ఎలా?''

ట్రాన్స్‌ఫర్లు— తడపడాలు— తల దిమ్మెక్కిపోయింది. మాస్టారు కలం మళ్లీ అదిరిపడింది. లెసన్‌ప్లాన్ మీద సిరామరకలు చిందాయి.

రాకాసి లోయలున్నాయి, రాక్షసులున్నారు, మునులూ ఉన్నారు. ఎటొచ్చీ అవతార పురుషులే కనిపించరు.

మాస్టారు రేపు మీరు మహాత్మాగాంధీ పాఠం చెప్పాలి.

అవును— చెప్పాలి. చెబుతాను. లెసన్‌ప్లాన్ కాగితంలోకి చూస్తున్నారు.

బాల్యంలో బాపూజీ తప్పులు చేసినా వాటిని సరిదిద్దుకున్నాడు. తిరిగి ఆ తప్పులను ఎన్నడూ చేయలేదు. ఆయన అహింసావాది. గొప్ప సంస్కర్త అంటరానితనం నేరం, పాపం అని చాటిచెప్పిన మహనీయుడు.

''నాన్నా పాలబ్బాయి వొచ్చాడు. రేపట్నించి పాలు పోయడట.''

''జీతం రాగానే పైసా బాకీ లేకుండా ఇస్తామని చెప్పా కదమ్మా.''

''అది ఎప్పుడూ వుండే పాటే అంటున్నాడు. డబ్బు ఇస్తేనే పాలు పోస్తాడట.''

పెద్దకూతురు మాటలు గుర్తుకొచ్చాయి.

''కిరాణా షావుకారు సరుకులు ఇవ్వనన్నాడు.'' ఖాళీ సంచీతో తిరిగొచ్చిన కొడుకు మొహం కళ్ళలో కనిపించింది.

కలం చేతికి బరువుగావుంది. కాగితం విశాలమైన ఎడారిలా వుంది.

మనసు లెసన్‌ప్లాన్ మీద లగ్నం కాలేదు.

లేచి అటూ ఇటూ పచార్లు చేయసాగారు మాస్టారు.

కళ్ళద్దాల పవరు తగ్గింది. కళ్ళు తిబద్దాలాడుతున్నాయి. కళ్ళద్దాలు మార్చుకునే అవసరం వున్నా వీలులేని పరిస్థితి.

కనీసం చెప్పాలన్నా పరువు దక్కనివ్వన్నాయి.

ప్చ్ !!!

నిట్టూర్చాడు మాస్టారు.

ఏం బతుకైపోయింది!!!

మరోసారి ఇంటివోనర్ హెచ్చరిక గుర్తుకొచ్చింది. గుండెల్లో గునపం గుచ్చుకుంది.

కనీసం రెండు నెలల అద్దెకట్టి బతిమిలాడితే ఊరుకుంటాడు.

రెండునెలల అద్దె అయిదొందలు!!!

పావుగంటదాకా మాస్టారు పచార్లు చేస్తూనేవున్నారు. పాలవాడు పాలు పోయకపోయినా, షావుకారు సరుకులు ఇవ్వనని కసురుకున్నా— నీళ్ళుతాగి కడుపు నింపుకోవచ్చు— కానీ— కానీ— గూడు లేకపోతే?

ఆ ఆలోచనే భరించలేక పోయారు. ఆ సీను కళ్ళలో మెదిలి కత్తిలా కోసేస్తున్నది.

''ఏవండీ—''

తలెత్తి చూశారు మాస్టారు.

ఎదురుగా భార్య శాంత.

బడిపంతులుకు ఆమె భార్య కాబోతుందని ఎలా పసిగట్టారో ఆమె తల్లిదండ్రులు. అందుకే ఆ పేరు పెట్టారు. శాంతమేకాదు, సహనం ఓర్పుతో పాటు భర్తకు ఆర్థికంగా తాను ఎలా సహాయ పడగలనా అని అనుక్షణం ఆవేదన పడుతూంటుంది.

''మీరేమీ అనవంటే." అని ఆగిపోయింది.

భార్య మొహంలోకి చూస్తున్నారు మాస్టారు.

చెప్పకముందే ఆమె చెప్పదలచుకున్నది ఏంటో చదవటం వారికి అలవాటు—

''ఊ...'' అన్నారు.

''మీ బాల్య స్నేహితుడు—''

''ఊ...''

''నారాయణ్రావు ఈ వూళ్లోనే బ్యాంకు ఉద్యోగి కదా—''

''అయితే?''

''నా వుద్దేశం ఆయన్ని అప్పు అడగమని కాదు.''

''మరి ?''

''ఆయన పనిచేసే బ్యాంకులో లోనేదైనా దొరుకుతుందేమో—''

''బంగారు నగలుంటే బ్యాంకులో లోను శాంతా—''

''మనకే నగలుంటే బ్యాంకులకు ఆ శ్రమ ఎందుకండి? నేరుగా బజారుకే వెళ్లేవాళ్ళం.

''ఆ సంగతి తెలుసుగదా. మరి నన్నిప్పుడు ఏం చేయమంటావ్ చెప్పు ?''

''నగలు లేకుండా పర్సనల్ లోన్ ఏదైనా ఇప్పిస్తారేమో.''

''అవి పలుకుబడిగల వాళ్ళకి, వ్యాపారస్తులకి శాంతా మనంలాంటి అపిపాను తీగెలకు కాదు—''

''అడిగిచూస్తే తప్పేవిటి— ఆ బ్యాంకు కాకపోతే మరో బ్యాంకు ఏదైనా ఇస్తుందేమో.''

ఆలోచించసాగాడు మాస్టారు.

అలా రాత్రంతా ఆలోచిస్తూనే వున్నారు.

ఆ పరిస్థితిలో భార్య సలహా ఒక్కటే శరణ్యం అనిపించింది.

మరునాడు ఉదయం బాల్యస్నేహితుడు నారాయణరావు ఇంటికి బయలుదేరబోతూ— చెప్పులేసుకుంటుంటే— కాళ్ళు వణుకుతున్నాయి.

అలనాటి కుచేలుడు శ్రీకృష్ణుని దర్శనానికి వెళ్ళిన సంఘటన గుర్తు కొచ్చింది.

చిన్నప్పట్నుంచి నారాయణరావుకు తనంటే వల్లమాలిన అభిమానమే.

ఆ అభిమానాన్ని ఆసరాగా తీసుకొని అతన్ని ఇబ్బంది పెట్టడం భావ్యమా ,

అడుగు వెనక్కు తీసుకున్నాడు.

భార్య దీనవదనం గుర్తుకు వచ్చింది, మాస్టారు బిక్కుబిక్కున చూస్తున్నారు.

ఏ క్షణంలో ఎవరు ఇంటిముందు వాలి పరువు తీసేది తెలియదు.

కిరోసిన్ స్టవ్ కాబట్టి సరిపోయింది. కానీ ఆ ఇంటి పొయ్యిని పిల్లి ఓ పట్టాన వొదిలి పెట్టేది కాదు.

దిగులుగా గడపలోనుంచున్న భార్య కనిపించింది. మనసు నీరయింది.

ఏవయ్యా అసలు నీకు జీతం దొరుకుతుందా? ఏ ఆఫీసులోనన్నా గుమాస్తాపని చూసుకోక పోయావా?

ఎందుకయ్యా బతకలేని ఈ బడిపంతులు పని చేస్తావ్? వెట్టిచాకిరీ చేస్తావ్—

మర్యాదగా రేపీపాటికి కిరాయి ఇయ్యకపోయావో నీ సంసారం వీధిలో పడుతుంది జాగ్రత్త!!!

చెళ్ళు చెళ్ళున కొరడా దెబ్బలు.

మరో ఆలోచనేది లేకుండా తల వంచుకుని వీధిలో నడుస్తున్నాడు రామనాథం మాస్టారు.

కిటికీనుంచి అంత దూరంలో రామనాథంను చూసిన నారాయణరావు భార్య శైలజ—

''ఏవండి— ఆ వొస్తున్నది రామనాథంగారే కదూ?'' అంది భర్తతో.

నారాయణ్రావు చూశాడు.

"అపునేవ్— చాలారోజుల తర్వాత వొస్తున్నాడు."

"ఎందుకై ఉంటుంది ?"

"ఎందుకేమిటి ? స్నేహితులు కలుసుకోడానికి కారణాలుంటాయా ?"

"కానీ ఒక బడిపంతులు స్నేహితున్ని కలుసుకోడానికి కారణం ఉంటుంది."

"అప్పుకోసమేనంటావా ?"

"ముమ్మాటికీ అంతే— ఒక్కసారి అలవాటు చేశారంటే ఇక పీక్కు తింటాడు జాగ్రత్త. అయినా మనమేమన్నా వడ్డీ వ్యాపారులమా వున్న షావు కార్లమా అప్పులివ్వడానికి—"

"అవునవును, నేనెందుకు అప్పు ఇస్తాను."

"ఇలాంటి పిచ్చిపిచ్చి పన్లుచేసి సంసారం గుల్ల చేశారంటే వూరుకు నేది లేదు."

"ఛా! ఛా! అలా ఎందుకు చేస్తాను."

"నీళ్ళు మింగుతూ మాట్లాడకండి. ఆయనకు అనుమానం వస్తుంది. కటువుగా మాట్లాడాలి."

"రామనాథం నా బాల్య స్నేహితుడు శైలూ. ఫ్లాష్‌బ్యాక్‌లు గుర్తు కొచ్చి వాడితో కటువుగా మాట్లాడలేనేమో."

"అయితే మీరు లోపలికి వెళ్ళండి. లేదని చెప్తాను."

"ఇంట్లో వుంటే లేదని చెప్తావా!!!"

"నామాట వింటావా లేదా ?"

కోపంవస్తే ఏకవచన ప్రయోగం చేస్తుంది. గుడ్లు తెరచి చూసింది శైలజ.

అలా తెరచి చూసిన కళ్ళు నాయణ్రావుకు భూమండలం, ఆకాశం వగైరాలు కనిపించలేవు. అత్తగారిల్ల మామగారి నిప్పుకళ్లు కన్పించాయి.

మరుక్షణంలో భార్య చెప్పినట్టు చేశాడు.

రామనాథం రాగానే—

''రండి అన్నయ్యా! కూర్చోండి! అని ఆహ్వానించింది శైలజ.

''బాగున్నారా అమ్మా— నారాయణ ఇంట్లో లేడా?'' ఆప్యాయంగా పలకరించాడు మాస్టారు.

''లేడన్నయ్యా! ఇప్పుడే బయటకి వెళ్లారు. దారిలో మీకు కనిపించ లేదా?''

''లేదే—''

''మీరు ఇటునుంచి వచ్చారేమో ఆయన అట్నుంచి వెళ్లివుంటారు.''

''అలాగా—''

అంతలో ''మమ్మీ'' అంటూ కొడుకువస్తే ''ఏవిట్రా?'' అని కసురుకుంది శైలజ.

''మమ్మీ. మరే పెన్ను కావాల్నే?''

''ఏమైందిరా నీ పెన్ను?''

''పోయిందికదా— నిన్నట్నుంచి చెబుతున్నా....''

''చెబితే ఏవిట్రా- నీకు వారానికికో పెన్ను కొనివ్వాలంటే మా చేత కాదు. చదువు మానెయ్యి. మీ నాన్నగారు పడుతున్న ఇబ్బందులు చూస్తున్నావు కదా- చెబితే ఎవరూ నమ్మరుకానీ చేసేది బ్యాంకు ఉద్యోగమేఅయినా సముద్రాన్ని తలావున పెట్టుకొని చేప నీళ్ళకు ఏడ్చినట్లు వచ్చేవాళ్ళు పోయేవాళ్ళు మీ అత్తయ్యల పురుళ్ళు డబ్బుకోసం మీ నాన్న ఎంత ఇబ్బంది పడుతున్నాడో తెలుసా. ఎక్కడైనా అప్పు అడగడానికేకదా ఇందాక వెళ్ళారు.

''ఇవ్వాళ వీక్లీ టెస్టు వుంది మమ్మీ.''

''ఉంటే ఏమంటావు చెప్పు? వున్న పెన్ను జాగ్రత్తగా కాపాడుకోవడం తెలియదు. ఇప్పటికిప్పుడు కొత్తది కావాలంటే ఎట్లా వస్తుందిచెప్పు. చేతిలో పైసాలేదు. అసలే నెలాఖరు రోజులు.''

''ఎట్లా మమ్మీ.''

''పెన్సితో రాయి పో.''

''టీచర్ పెన్సిల్‌తో రాయొద్దని చెప్పింది.''

''అయితే స్కూలుకు వెళ్ళను. ఇంట్లో కూర్చో.'' కోపంగా అంది శైలజ.

ఆ అబ్బాయిని చూస్తుంటే మాస్టారి హృదయం ద్రవించింది. దగ్గరికి పిలిచాడు.

''ఏం చదువుతున్నావు నానా'' ఆప్యాయంగా అక్కున చేర్చుకుని అడిగాడు.

''ఫోర్తుక్లాస్—''

''ఇవ్వాల్టినుంచి వీక్లీ టెస్టులున్నాయా?''

అవునని తలూపాడు.

''ఇదిగో ఈ పెన్నుతో రాసుకో.'' తన జేబుకున్న పెన్ను తీసి ఇచ్చారు మాస్టారు.

''ఏందుకులెండి అన్నయ్యగారూ- ఫస్టు రాగానే వాళ్ళ డాడీ కొనిస్తారు కదా—''

''ఫరవాలేదులే వుండనీయమ్మా వస్తా'' అంటూ లేచాడు.

''అయ్యో! అప్పుడే వెళ్తారా?'' ఆదుర్దా నటించింది శైలజ.

''ఆ— కొంచెం పనుందమ్మా. త్వరగా వెళ్ళాలి. నారాయణను అడిగానని చెప్పు.''

''అలాగే.''

''పరీక్షలు బాగా రాయి బాబూ'' అని అబ్బాయి వెన్నుతట్టి వెనక్కి తిరిగాడు మాస్టారు!!!

( ఆంధ్రభూమి మంత్లీ ఫిబ్రవరి 1989 )